# స్త్రీలు, పిల్లలు ముందు

సర్కస్ సింహం అయిష్టంగా కదిలివచ్చి స్టూలుమీద నిలబడ్డట్టు బృందావన్ ఎక్స్‌ప్రెస్ బెంగుళూరు సిటీ స్టేషన్ పట్టాల మీద నిలబడింది. తిరగబడ్తూ గర్జించినా చివరికి రింగ్‌మాస్టర్‌కి లొంగి చెప్పినచోట నిలబడిన సింహంలా, రొదపెట్టి కీచుమంటూ డ్రైవర్ చెప్పినచోట రైలాగింది. ట్రెపీజ్‌మీద ఊగే అమ్మాయిలు తమని అందుకోవలసిన తోటివారు అందుకోలేకపోతారేమోనన్న అనుమానంతో క్షణంపాటు అదుర్దాపడేటట్టు - ప్రయాణీకులు తమని రిసీవ్ చేసుకోడానికి రావలసినవారు రారేమోనని కంగారు పడ్తూ కిటికీలలోంచి బయటికి చూస్తున్నారు.

"వాడు నా క్లోజ్ ఫ్రెండు తప్పకుండా వస్తాడు" అని సన్యాసిరావు వరలక్ష్మికారోజులో అయిదోసారి భరోసా ఇచ్చాడు.అయితే వరలక్ష్మికి భర్త క్లోజ్ ఫ్రెండ్ అయిన సదరు శ్రీరామ్ రాడన్న అపనమ్మకం గాని, రాకపోవచ్చునన్న అనుమానంగాని లేవు. ఒకవేళ రాకపోతే "ఏదో హోటల్లో దిగవచ్చు" అన్న నిశ్చయం కూడా ఉంది.

ఆ మాట మొదటిసారి రైలు మెడ్రాసు ప్లాట్ ఫామ్‌మీద, రెండోసారి రైలు ఆర్కోణం స్టేషను దాటుతున్నప్పుడు, మూడోసారి కాట్పాడిలో రైలు ఆగినప్పుడు,నాలుగోసారి బెంగుళూరు ఈస్టువద్ద భర్తకి చెప్పింది. ఆయిదోసారి వూరుకొంది. కాని భర్త చాదస్తానికి కాస్త విసుక్కొంది.

సన్యాసిరావు పెట్టె బెడ్డింగ్ దింపి ఆ పైన నాలుగేళ్ళ కొడుకు ప్రసాద్‌ని జాగ్రత్తగా చెయ్యి పట్టుకొని దింపాడు. వరలక్ష్మి చేతిలో బుట్ట పట్టుకొని దిగబోతుంటే హడావిడిగా వచ్చాడు శ్రీరామ్. వచ్చి వరలక్ష్మి చేతిలో బుట్ట అందుకోడానికి చెయ్యి చాచి

"ఆ బుట్ట ఇల్లా ఇచ్చి జాగ్రత్తగా దిగండి" అన్నాడు. వరలక్ష్మి బుట్ట అందించింది.

వచ్చిన మిత్రుడిని చూస్తూ సంతోషించాడు సన్యాసిరావు.

"వచ్చావా" అంటూ చెయ్యి జాచాడు.

"మీ ఆవిడకు అందించు ఆ చెయ్యి" అన్నాడు శ్రీరామ్.

"మా ఆవిడ దిగ్గలదులేవోయ్" అన్నాడు సన్యాసిరావు ఆ ప్రయత్నం చెయ్యకుండా

"అక్కర్లేదు! వద్దు!" అని సిగ్గుపడుతూ దూకేసింది వరలక్ష్మి. ఫీట్సుచెయ్యడం పూర్తయ్యాక సైకిల్ మీద నుంచి దూకే సర్కస్ అమ్మాయి అంత చలాగ్గాను. మరింత అందంగాను దూకింది వరలక్ష్మి.

సన్యాసిరావు కూలీని పిలిచి సామాను నెత్తి కెత్తి బుట్ట చేతికిచ్చాడు. వరలక్ష్మి ప్రసాద్‌ని ఎత్తుకొంది, జనంలో తప్పిపోతాడని.

"లెట్ మి కారీ హిమ్, నా కివ్వండి" అన్నాడు శ్రీరామ్.

ప్రసాద్ కొత్త మనిషి దగ్గరకు వెళ్లనన్నాడు.

"మా వాడికి కొత్తలే" అన్నాడు సన్యాసిరావు.

"అయితే నువ్వు తీసుకో, ఆడవాళ్ళు మొయ్యటమేమిటి?" అని శ్రీరామ్ సన్యాసిరావుని మందలించాడు.

సన్యాసిరావు చేతిలోకి టికెట్లు తీసుకొని ఆ పైన ప్రసాద్ నందుకొన్నాడు.

కూలీలు సామాన్లు ఒకదానిమీద ఒకటి పేర్చుకొని బాలెన్సు చేస్తూ ప్రయాణీకుల ముందు దారి తీస్తున్నారు.

శ్రీరామ్ టాక్సీ మాట్లాడాడు. కూలీ సామాన్లు డిక్కీలో పెట్టి డబ్బు తీసుకొని వెళ్లిపోయాడు. సన్యాసిరావు కూలీని పంపి వచ్చేలోపల టాక్సీ తలుపు తెరిచి పట్టుకొని గౌరవంగా వరలక్ష్మిని, ప్రసాద్‌ని లోపల కూర్చోపెట్టాడు శ్రీరామ్. సన్యాసిరావుని వెనకాతల ఎక్కనిచ్చి, తను ముందు ఎక్కాడు. నల్లటి ఎంబాసిడర్ టాక్సీలు ఒకదాని వెంట మరొకటి పోతుంటే ఒకదానితోక మరొకటి పుచ్చుకొని నడిచే ఏనుగుల బారు కదిలినట్టుంది.

టాక్సీ అండర్‌బ్రిడ్జి క్రిందనుంచి పోయి మల్లేశ్వరం వైపు తిరిగింది. ఎడంవేపున దూరంగా కోలాహలంగా సర్కస్ టెంట్ కనిపించింది.

"ప్రస్తుతం వూళ్లో సర్కస్ వుంది" అన్నాడు శ్రీరామ్.

"సర్కస్ అంటే?" ప్రసాద్ తండ్రి నడిగాడు.

"మీ అమ్మ వంటింట్లో చేస్తుందే అది" అన్నాడు సన్యాసిరావు నవ్వుతూ.

శ్రీరామ్ వెనక్కి తిరిగి, "వెధవజోకూ నువ్వూనూ. లక్ష్మిగారూ! ఇతన్ని ఒకటి వెయ్యక ఆలోచిస్తారేం" అన్నాడు.

వరలక్ష్మి ఉలిక్కిపడింది. తనతో తన భర్త స్నేహితులు మాట్లాడటమే తక్కువ! పేరు పెట్టి పలకరించటం ఇంకా తక్కువ!

తన జోకును వెధవజోకని శ్రీరామ్ అన్నందుకు సన్యాసిరావు క్షణం పాటు చిన్నబుచ్చు కొన్నాడు. తన సర్కిల్‌లో వేసుకొనే జోకిలల్లాంటివే! అయినా శ్రీరామ్ తన

క్లోజ్‌ఫ్రెండ్, తనని చిన్నబుచ్చాలని వుండదు అతనికి. లేడీస్ గురించి, లేడీస్‌తోను, గౌరవంగా మాట్లాడటం ఓ అలవాటు. హి ఈజ్ ఎగాలంట్.

"సర్కస్ అంటే అక్కడ పెద్ద పులులుంటాయి, ఏనుగులుంటాయి, గుర్రాలుంటాయి. అబ్బాయిలు, అమ్మాయిలు మొగ్గలు వేస్తారు. డాన్స్ చేస్తారు. బఫూన్స్ ఉంటారు. తమాషాలు చేస్తారు. భలే ఉంటుంది" అని ప్రసాద్‌కి వివరించాడు శ్రీరామ్.

"నాన్నా! మనం సర్కస్ చూద్దాం"

"మన ఊళ్లో చూద్దాం"

"ఈ ఊళ్లో మీరంతా నేను చెప్పినట్టు చేస్తారు. లెటజ్ గో, సర్కస్ చూద్దాం!" అని శ్రీరామ్ ప్రామిస్ చేశాడు ప్రసాద్‌కి.

"అల్లాగే" అని అంగీకరించాడు సన్యాసిరావు.

మల్లేశ్వరం నాలుగో మెయిన్ పదహారో క్రాస్ ఖండించు కొన్నచోట టాక్సీ ఆగింది. శ్రీరామ్ ముందు దిగి వరలక్ష్మి వైపు తలుపు తెరిచి పట్టుకొన్నాడు. వరలక్ష్మి దిగింది. "థాంక్స్" అనలేక సిగ్గుపడింది. సన్యాసిరావు దిగి ప్రసాద్‌ని దింపాడు. డిక్కీలో సామాన్లు దింపుకొన్నాడు, టాక్సీకి డబ్బు ఇచ్చి పంపించాడు.

"రండి రండి ! ఎన్నాళ్లకి చూశాను" అంటూ శ్రీరామ్ భార్య అతిథులకెదురువచ్చి ఆహ్వానించింది.

ఇంటిముందర వరండాకి ఉన్న గ్రిల్ తలుపుల్లోంచి బోనులోకి వెళ్తున్నట్టు లోపలికి వెళ్లాడు సన్యాసిరావు సకుటుంబంగా.

అతిథులు స్నానాలు చేసేసరికి శైలజ టేబుల్ మీద వంటకాలు సర్దింది, శ్రీరామ్ కుర్చీలు వేసి, ప్లేట్లు పెట్టి మంచినీళ్లు పెట్టాడు.

శ్రీరామ్ ఒక కుర్చీ లాగి అందులో వరలక్ష్మిని కూర్చోమన్నాడు.

"నేను, వదినగారు తరువాత తింటాం" అంది వరలక్ష్మి.

"తను తరువాత తింటుందివై. ప్రసాద్‌కి అన్నం పెట్టాలి కదా!"అన్నాడు సన్యాసిరావు.

"శైలు మనతోనే తింటుంది. మీ ప్రసాద్ మీ ఇద్దరి మధ్య వేసిన ఎత్తు కుర్చీలో కూర్చుంటాడు. మీరు రండి లక్ష్మిగారు" అన్నాడు శ్రీరామ్.

వరలక్ష్మికి తప్పలేదు. శ్రీరామ్ చూపించిన స్థలంలో వచ్చి నిలబడింది. అప్పుడు శ్రీరామ్ తను అంతకుముందు వెనక్కి ఈడ్చిన కుర్చీని దాని స్థలంలోకి తోశాడు. వరలక్ష్మి కూర్చుంది. శ్రీరామ్ ప్రసాద్‌ని ఎత్తు కుర్చీలో కూర్చోబెట్టాడు. సన్యాసిరావు ప్రసాద్ పక్కన కూర్చున్నాడు.

"రా శైలూ!" అని భార్యని పిలిచి ఆమెకు కూడా కుర్చీలాగి పట్టుకొని సహాయం చేశాడు శ్రీరామ్.ఆ పైన తను కూర్చున్నాడు.

తనకు శ్రీరామ్ చేసిన గౌరవం తన భర్త శైలజకి చేసుండాల్సింది అనుకొంది వరలక్ష్మి. బుద్ధావతారంలా ముందు కుర్చీలో స్థిరపడిన భర్తను శ్రీరామ్‌తో పోల్చి చూసుకొని సిగ్గుపడింది.

"మీ అబ్బాయికి నాలుగేళ్లు వచ్చేవరకు మాకు చూడటమే పడలేదు అన్నయ్యగారూ!' అంది శైలజ మాటల్లో సన్యాసిరావుతో.

శైలజ తనని వరుసపెట్టి పలకరించినందుకు సన్యాసిరావు మురిసిపోతూ-

"అందుకే మీ అల్లుడిని మీకు చూపించి హెచ్చరిద్దామని వచ్చాం. రామం తొందరగా ఓ ఆడపిల్లని కనీవై. అఫ్‌కోర్సు కనేది నువ్వు కాదు, చెల్లాయి గారనుకో. ఆవిడ చేత కనిపించెయ్యి. క్లోజ్ ఫ్రెండుతో వియ్యమందాలని నాకు సరదాగా ఉంది" అన్నాడు.

వరలక్ష్మి నవ్వింది. ఇటువంటి నాటు జోక్స్ నచ్చని శ్రీరామ్ ముఖం ఇబ్బందిగా పెట్టాడు. అతని ముఖం చూసి 'నవ్వడం తప్పు కాబోలు' అని వరలక్ష్మి నవ్వు ఆపుకొంది.

ఆ రోజు మొదలు శ్రీరామ్ ప్రతి విషయంలోను "లేడీస్ అండ్ చిల్డ్రెన్ ఫస్ట్" అంటూ హడావిడి చెయ్యడం, "ఆడవాళ్ళు శ్రమ పడకూడదు" అంటూ గిన్నెలు సర్దటం, తియ్యటం, భార్యను, తనను కూర్చోబెట్టి కాఫీలు అందించటం చూసి వరలక్ష్మి ముచ్చటపడింది.

భార్య నెత్తిమీద పెట్టె పెట్టి చేతులూపుకొంటూ ముందు నడిచే భర్తల్ని తమ ప్రాంతపు రైలు స్టేషన్లలో చాలా మందిని చూసిన వరలక్ష్మి, "సిటీవాళ్లకున్న నాజూకు, మర్యాదా, మన్నన మరోచోట కనిపించవు" అనుకొంది.

సన్యాసిరావు, వరలక్ష్మి భేదాభిప్రాయాలు వ్యక్తపరిస్తే శ్రీరామ్ వరలక్ష్మిని సమర్థిస్తూ వచ్చాడు. తన మాట భార్య కాదంటే

"యూఆర్ రైట్ డియర్ !" అంటూ శ్రీరామ్ శైలజ పక్షం అయ్యేవాడు.

ఒకటి రెండుసార్లు క్లోజ్ ఫ్రెండ్ అయిన శ్రీరామ్‌ని సమర్థించ బోయి సన్యాసిరావు ఫూల్ అయ్యాడు శ్రీరామ్ శైలజ పక్షం అవడంతో.

"అడవి మనుష్యులు, ప్రమాదం వస్తుందంటే చాలు స్త్రీలను పిల్లలను పోలీసుల ఘాతకాలకి వదిలిపెట్టి అడవుల్లోకి పారిపోతారు. తమ స్త్రీలను ప్రాణాలని ఒడ్డి అయినా రక్షించుకోవాలన్న జ్ఞానం ఉండదు" అని శ్రీరామ్ ఓసారి ట్రైబల్స్‌ని విమర్శించాడు.

" ప్రమాదాన్ని రుచి చూడటానికి కూడా లేడీస్ అండ్ చిల్డ్రెన్‌కి వాళ్లు ఫస్టు ఛాన్స్ ఇస్తారు" అని సన్యాసిరావు నవ్వాడు. ఆ వెర్రినవ్వు భర్త బైతుతనం బయట పెట్టినట్టుగా సిగ్గుపడి వరలక్ష్మి, తల వంచుకొంది.

శ్రీరామ్ అన్నీ పర్‌ఫెక్ట్ టైమింగ్‌తో నీట్‌గా నైపుణ్యంతో చేసే సర్కస్ ఆర్టిస్టులాగాను, భర్త ఏదీ సరిగా చెయ్యలేక వెర్రి నవ్వులు నవ్వుతూ నవ్వుల పాలయ్యే బఫూన్‌లాగాను

వరలక్ష్మికి కనిపించారు. భర్త శక్తిమీద నమ్మకంతో బల్లకానుకొని భర్త కత్తులు విసురుతుంటే నిబ్బరంగా నిలబడే సర్కస్ సానిలాగా శైలజ నాకేమన్నట్టు "నా భర్త నాగురించి పూర్తి శ్రద్ధ వహిస్తాడు" అన్నట్టు నిశ్చింతగా ప్రవర్తిస్తుంటే, భర్త ఏ తెలివితక్కువ మాట ఎప్పుడు వదుల్తాడో అని భయంతో తను ప్రవర్తిస్తోంది !

ఫిబ్రవరి నెల అవటంతో పగలు కూడా చిరు చలిగా ఉండి ఊరంతా చూడటానికి ఉపకరించింది అలుపు లేకుండా చేసి.

" రేపు ఆదివారం వెళ్తాంవై " అన్నాడు సన్యాసిరావు.

" అప్పుడేనా ! " అంది శైలజ.

"మేము మూడోతారీకున వచ్చాం. ఇవాళ ఏడు. ఇంకా వుండి మిమ్మల్ని యిబ్బంది పెట్టడమా!" అన్నాడు సన్యాసిరావు.

"ఇబ్బంది లేదు ఇట్ ఈజ్ ఎ ప్లెజర్ " అన్నాడు శ్రీరామ్.

"నాకు స్వంత పుట్టింట్లో ఉన్నంత సుఖంగా ఉంది. ఆయనకి అత్తవారింట్లో ఉన్నంత ఘనంగా మర్యాదలు జరుగుతున్నాయి. కాని మా యింటికి స్నేహితుల్ని కాపలా పెట్టి వచ్చాం. వాళ్లని చెర విడిపించాలి వెళ్లి. రేపే బస్సులో మెడ్రాస్ వెళ్లి అక్కణ్ణుంచి వెళ్తాం. మరోలా అనుకోకండి" అని సర్దిచెప్పింది వరలక్ష్మి.

"ఓకే! అయితే ఇవాళ ప్రసాద్‌కి సర్కస్ చూపిద్దాం" అన్నాడు శ్రీరామ్.

ప్రసాద్ "బలే బలే" అని గెంతాడు. ఆ రోజు 1981 ఫిబ్రవరి 7వ తారీకు శనివారం. మూడు గంటల ముప్పయి నిముషాల ప్రదర్శనకి బయల్దేరారు. ఇంటి వాళ్లు "పిల్లల్ని పంపించమా?" అని ఆడిగారు.

"పంపిచమనవై" అన్నాడు సన్యాసిరావు.

"ఇతర్ల పిల్లల్ని తీసుకు వెళ్లటం పెద్ద రెస్పాన్సిబిలిటి. పైగా మనమే అయితే రెండు ఆటోల్లో వెళ్లి రావచ్చు, వాళ్ళు కూడా వుంటే బస్సుల్లో వెళ్లాలి. కన్వీనియంట్ బస్సులు లేవు. చచ్చేలా నడవాల్సి వస్తుంది" ఆని శ్రీరామ్ సుముఖత చూపించలేదు.

వీళ్లు వెళ్లేసరికి ఒంటిగంట ఆటవిడిచి పెట్టలేదు. శ్రీరామ్ టిక్కెట్లు కొన్నాడు. మూడు గంటల నలభై అయిదు నిముషాలకు ఆట వదిలారు. లోపలున్న వాళ్లని బయటికి రానీయకుండా బయట ఉన్నజనం అడ్డుపడున్నారు. ఉన్నది ఒకటే మార్గం. పైగా ఆ రోజు స్కూలు పిల్లలకి కన్సెషన్ ఇచ్చిన సందర్భంగా చాలా మంది పిల్లలు వచ్చారు.

"పిల్లలకి దారి వదలండి" అని శ్రీరామ్ గట్టిగా కోపంగా అరిచాడు. విన్నవాళ్లు కొందరు దారిచ్చారు.

పది నిముషాల్లో రష్ తగ్గింది. శ్రీరామ్ వాళ్లు దేదీప్యమానంగా వెలుగుతున్న దీపాల్ని చూస్తూ డేరాలో ప్రవేశించారు. శ్రీరామ్ కొన్న టికెట్లు గాలరీకి రంగస్థలానికి మధ్య ఉన్న

తరగతివి.

సన్యాసిరావు కూర్చోబోయి, "లేడీస్ అండ్ చిల్డ్రన్ ఫస్టు" అన్నాడు శ్రీరామ్‌ని అనుకరిస్తూ.

వరలక్ష్మి భర్తకేసి చురుకుగా చూసింది. సన్యాసిరావు ఓ వెర్రి నవ్వు నవ్వాడు.

వరలక్ష్మి సన్యాసిరావు ప్రసాద్‌ని మధ్యలో పెట్టుకొని కూర్చున్నారు. వరలక్ష్మి పక్కన శైలజ, శైలజ పక్కన బయటకు పోయే దారి నానుకొని ఉన్న కుర్చీలో శ్రీరామ్ కూర్చున్నారు. వాద్య సంగీతం ఆహ్లాదకరంగా వినిపిస్తోంది.

ప్రదర్శన పులులతోను, సింహాలతోను మొదలైంది. ప్రసాద్ భయం భయంగాను ఇష్టంగాను సర్కస్ చూడటం మొదలు పెట్టాడు. బాగా భయం వేస్తే తండ్రి చెయ్యి గట్టిగా పట్టుకొన్నాడు, తండ్రి రక్షణలో తనకే ప్రమాదము రాదన్న నమ్మకంతో.

ఆరుగంటల పదిహేను నిముషాలకి ప్రదర్శన చివరి అంశంలోకి వచ్చింది.

"లేడీస్, జంటిల్‌మెన్ అండ్ చిల్డ్రెన్, దిస్ ఈజ్ అవర్ లాస్ట్ ఐటమ్ అండ్ వన్ ఆఫ్ అవర్ వెరీ డేరింగ్ ఆక్ట్స్. ట్రెపీజ్ ఇన్ ద డార్క్‌నెస్" అని ప్రకటించారు.

సన్యాసిరావు వాళ్ల వెనకాతల కూర్చున్న హెడ్‌మాస్టరొకాయన, "ప్రదర్శన పూర్తయ్యాక ఒక పట్టాన బయట పడలేం, పదండి పోదాం" అని పిల్లల్ని లేపి బయల్దేర దీశాడు. పిల్లలు అయిష్టంగా కదిలారు.

ఆర్టిస్టులు వల మీదనున్న నిచ్చెనలద్వారా ఉయ్యాలలు జేరుకొన్నారు. డేరాలో లైట్లు ఆర్పేశారు. స్పాట్‌లైట్ వేసారు. అనంతాకాశంలోని అంధకారంలో అలవాటుగ పయనించే తారల్లాగా ఆ చీకట్లో సర్కస్ తారలు లక్ష్యం తప్పక గమ్యాలని చేరుకొంటున్నారు. ప్రేక్షకులు ఉగ్గబట్టుకు ఆ ప్రదర్శన చూసారు.

ప్రదర్శన ముగిసింది లైట్లు వెలిగాయి. ఆర్టిస్టులు కిందికి దిగి వంగి నమస్కరించారు. జనం బయటకు పోవడానికి లేచారు!

బాండ్ వాయిస్తున్నవేపు డేరా పై భాగంలో మంటలు లేచాయి!

"బెంకి!బెంకి! అని అరిచారెవరో.

"ఫైర్!ఫైర్!"

"మంటలు! మంటలు! మనవేపే వ్యాపిస్తున్నాయి. లెటజ్ గెట్ ఔట్!"

జనం కంగారు పడ్డారు! అందరూ నిష్క్రమణవైపు నడవబోయారు. తోపుడు మొదలైంది. ఉన్నది ఒకటే ద్వారం. ఆ ద్వారం బయట తరువాత ఆట చూడటానికి వచ్చిన జనం అడ్డంగా నిలబడి లోపలికి పోవడానికి నిరీక్షిస్తున్నారు.

జనంలో భయం అలుముకొంది. ఒకటే ధ్యేయం అందరిది, ఎల్లాగో అల్లా ప్రమాదం నుంచి బయట పడాలి! రంగస్థలానికి దగ్గరగా ఉన్న వాళ్లు ప్రమాదానికి దగ్గరగా

ఉన్నారు. కాలిన భాగాలు కూలి మీద పడటానికి సిద్ధంగా ఉన్నాయి. కుర్చీలమీద నుంచి దాటుకొంటూ ప్రాణాలు రక్షించడం కోసం జనం పరిగెత్త జొచ్చారు. అల్ల కల్లోలం చెలరేగింది.

శ్రీరామ్, సన్యాసిరావు, శైలజ, వరలక్ష్మి, ప్రసాద్ లేచి నిలబడ్డారు. ఇంతలో వారిముందు జనం ఒక కెరటంలా వచ్చి మీదపడి వీళ్లను తొక్కుకుంటూ తోసుకొంటూ దాటి గుమ్మం వైపు వెళ్లారు. తోపిడిలో వీళ్లు చెల్లా చెదురయ్యారు.

సన్యాసిరావు " ప్రసాద్" అని అరిచాడు. జవాబు లేదు. కుర్చీమీద నిలబడి చూడబోయాడు. జనం సన్యాసిరావును కిందకి పడదోశారు. మీద నుంచి జనం పరుగెత్తే లోపల లేచి నిలబడగలిగాడు.

అంతా అయిపోయింది! ప్రసాద్ అందరి కాళ్లకింద పడి నలిగిపోయి వుంటాడు! గుండెల్లో గుబులుగా దుఃఖం పెల్లు బికింది. ప్రసాద్ లేకుండా తను బయటికి వెళ్లినా బతకలేడు. తను ప్రసాద్‌ని వెతకాలి. రక్షించుకోవాలి, ఇంకా ప్రాణాలతో ఉంటే! సన్యాసిరావుకి తెగింపు వచ్చేసింది. జనాన్ని నెట్టుకొంటూ తాము ముందు కూర్చున్న చోటుకి జనప్రవాహానికి ఎదురీదుతూ వెళ్లాడు.

అదృష్టం కొద్దీ ప్రసాద్ రెండు కుర్చీల మధ్య ఏ ప్రమాదానికి గురి కాకుండా నిలబడి వున్నాడు. వణుకుతున్న ప్రసాద్‌ని ఎత్తుకొని గుండెలకానించుకొన్నాడు. ఆ క్షణం కలిగిన ఆనందం అతను ఎప్పుడూ పొందలేదు. ప్రసాద్ తండ్రిని చూసి బావురుమని ఏడ్చాడు.

సన్యాసిరావు ప్రసాద్ నెత్తుకుని ఎగ్జిట్ వైపు నడుస్తూ, అక్కడోచోట, జనానికి పక్కగా నక్కి ఏడుస్తున్న వరలక్ష్మిని, బెంగగా మొగుడి కోసం కలియజూస్తున్న శైలజని చూశాడు.

"ప్రసాద్! ఏమండీ!" అని - అరిచింది వరలక్ష్మి ఆనందంగా.

"ఆయన కనిపించారా?" అని అడిగింది శైలజ.

"లేదు. నేను వెతుకుతాను. ముందర మిమ్మల్ని సురక్షిత ప్రాంతానికి జేరుస్తాను. స్త్రీలని పిల్లలని ప్రమాదానికి వదిలేస్తే శ్రీరామ్ లైక్ చెయ్యడు. అతను నా క్లోజ్ ఫ్రెండ్. అతని కిష్టంలేని పని చెయ్యను" అంటూ సన్యాసిరావు వరలక్ష్మితోను, శైలజతోను, ప్రసాద్‌తోను బయటకి నడిచాడు. డేరా బయట పడ్డాక కాస్త ప్రపంచం కనిపించింది. డేరా చుట్టూ ఇనుప కటకటాల ఆవరణ, దానికి మళ్లీ ఒకటే గేటు.ఆగేటుకి అడ్డంగా జనం, తరువాతి ఆట చూడటానికి వచ్చిన జనం, మంటలు చూసి సహాయం చెయ్యడానికి పోగవుతున్న జనం, చోద్యం చూద్దామని వచ్చిన జనం!

పక్కింటి పిల్లల్ని తీసుకురానందుకు సన్యాసిరావు సంతోషించాడు. చివరలో లేచి వెళ్లిపోయిన స్కూలు వాళ్లు అదృష్టవంతులు అనుకొన్నాడు. ఈ ఆలోచనలతో సన్యాసిరావు బుర్ర చురుకుగ పనిచేసింది. గేటు నుంచి ఎడం వైపుకు దారి తీశాడు ప్రసాద్‌ని ఎత్తుకొనే. ఆ సమయంలో లైట్లు పోయాయి. బెంగుళూరులో ఆ ప్రాంతం అంతా అంధకారంలో మునిగి

పోయింది. దివిటీలా వెలుగుతున్న డేరా వెలుగునిస్తోంది బయట జనానికి.

"మీరు చీరలు గోచీ పోసుకొని ఈ కటకటాలు దూకాలి. సిగ్గుపడటానికి సమయం కాదు. మోకాళ్ల మీదకి ఎగకట్టండి" అన్నాడు సన్యాసిరావు. ప్రసాద్‌ని వరలక్ష్మి చేతికిచ్చాడు.

శైలజని అమాంతం ఎత్తుకుని కటకటాల మీదకి ఎగబాకించాడు.

"దూకండి!" కమాండర్ లాగా ఆజ్ఞాపించాడు సన్యాసిరావు. శైలజ దూకింది. ప్రసాద్‌ని కటకటాల మీదకి ఎక్కించి, అటువైపునున్న శైలజని అందుకోమన్నాడు. శైలజ అందుకొంది. తరువాత వరలక్ష్మిని దాటించాడు.

శ్రీరామ్‌ని వెతకాలి. అతనెక్కడో స్త్రీలకి, పిల్లలకి సహాయం చేస్తూ ఉండిపోయి ఉంటాడు. సన్యాసిరావు ఊపిరి పీల్చుకొని చుట్టూ చూశాడు.సన్యాసిరావు వాళ్లని చూసి చాలా మంది కటకటాల మీదకి ఎక్కి దూకటం మొదలుపెట్టారు. దాటుతున్న వారంతా పెద్దవాళ్లు, పురుషులు! అంటే స్త్రీలు, పిల్లలు? లోపలున్నారన్నమాట!

సన్యాసిరావుకి వీరావేశం వచ్చింది. జేబులోంచి చిన్న తాళం చెవుల గుత్తి తీసి దాంట్లో వున్న చాకును లాగాడు. ఆ చాకుతో డేరా చించాడు. లోపలి దృశ్యం వళ్లు గగుర్పొడిచేలా వుంది.

కాలిపోతున్న పిల్లలు, స్త్రీలు, జనం కాళ్లకింద నలిగిపోయిన పిల్లలు, తల్లిదండ్రుల నుంచి తప్పిపోయి ఏడుస్తున్న పిల్లలు, వంటరిగావచ్చి చిక్కడిపోయిన స్కూలు పిల్లలు, జ్యోతుల్ని వెలిగించే అగ్ని ఎన్నో ఇండ్ల దీపాలని ఆర్పేస్తూ ప్రచండంగా భీబత్సంగా మండుతోంది!

సన్యాసిరావు చేతికందిన ఇద్దరు పిల్లల్ని చెరో చంకన ఇరికించుకుని కటకటాల మీదుగా వరలక్ష్మికి, శైలజకి అందించాడు. సన్యాసిరావు పాతిక ట్రిప్పులు వేశాడు. మంటలు చివరిదాకా వచ్చేశాయి. పోలీసులు వచ్చారు. అటువైపునున్న జనాన్ని ఖాళీచేయించారు. వరలక్ష్మి, "మా ఆయన లోపల ఉన్నారు" అని చెప్పింది కదలనన్నట్టు.

"మేం చూసుకొంటాం" అన్నారువాళ్లు. దార్నపోయే వాహనాలని ఆపి జనాన్ని ఎక్కించి పంపించెయ్యడం మొదలుపెట్టారు. శైలజ వో స్కూటర్ వెనకాతల, వరలక్ష్మి ప్రసాద్ లను ఓ స్కూటర్ వెనకాతల ఎక్కించారు.

సన్యాసిరావు ఇరవైఆరోసారి లోపలికి ప్రవేశించాడు. డేరాలో మంటల మధ్య ఒంటరిగా స్కూలు యూనిఫామ్‌లో భయంతో బిగదీసుకొని పోయిన పాప కనిపించింది. సన్యాసిరావు కొంచెం లోపలగా వెళ్లి ఆ పిల్లని రక్షించడంలో అతనిబట్టలు అంటుకొన్నాయి. దాన్ని లెక్కచెయ్యకుండా పాపని కటకటాల అవతల ఉన్న పోలీసుల కందించాడు. ఆ తరువాత తను ఎక్కాడు. ఆ ఇనుప కటకటాల ఆవరణ మనుష్యుల బరువుకి కూలిపోయింది.

స్పృహ వచ్చేసరికి ఆస్పత్రిలో ఉన్నాడు. ఎదురుగా స్టూలు మీద వరలక్ష్మి కూర్చుని ఉంది.

"ప్రసాద్?" అని నీరసంగా ప్రశ్నించాడు సన్యాసిరావు.

"క్షేమంగా శైలజగారి దగ్గరున్నాడు" అని చెప్పింది వరలక్ష్మి.

"శ్రీరామ్?"

"ఆయనా క్షేమమే!" ట్రైబల్స్‌ని విమర్శించిన శ్రీరామ్ ముందు తన క్షేమం చూసుకొన్న విషయం గుర్తుకు వచ్చింది వరలక్ష్మికి.

తాము ఇంటికి ఎల్లా చేరుకున్నారో, వాళ్లని పోలీసులు ఎల్లా ఉండనివ్వలేదో చెప్పింది.

"పోలీసులు మంచి పని చేశారు. మిమ్మల్ని ఇంటికి జేర్చిన పుణ్యాత్ములకి థాంక్స్ చెప్పాలి" అన్నాడు మనస్ఫూర్తిగా సన్యాసిరావు.

"అందరు మగ వెధవల్ని నమ్మి స్కూటర్లెక్కి రావటమేనా?" అనిశ్రీరామ్ తనని, శైలజని మర్యాదా మన్ననా మరిచిపోయి కేకలు వెయ్యటం వరలక్ష్మికి గుర్తుకు వచ్చింది.

"కనీసం తనతో ఆడవాళ్లున్నారని, వాళ్లని క్షేమంగా ఇంటికి జేర్చాల్సిన బాధ్యత ఉందని తట్టలేదా అతనికి, నా నుంచీ దూరం అయ్యారుగాని లేకపోతే మీకు ఎవరి స్కూటర్లు పడ్తే వాళ్లవి ఎక్కి రావల్సిన పరిస్థితి రానిద్దునా?" అని శ్రీరామ్ సన్యాసిరావుని విసుక్కున్నట్లు వరలక్ష్మి చెప్పలేదు సన్యాసిరావుకి.

'మీ క్లోజ్ ఫ్రెండ్ ఇంటి దాకా ఆగకుండా పరిగెత్తాడు. ఇంటి దగ్గరగాని అతనికి భార్యా, స్నేహితుడి భార్యా పిల్లలు గుర్తుకు రాలేదు' అని కూడా చెప్పలేదు.

"ముందర సన్యాసిరావు గారి గురించి వాకబు చెయ్యండి" అని శైలజ అంటే అప్పుడు గాని శ్రీరామ్ ఆ విషయం పట్టించుకోలేదు.

గాయపడినవారిని, మృతులైనవారిని ఏ ఆస్పత్రికి వీలైతే ఆ ఆస్పత్రికి జేర్చారని, అందులో కొందర్ని మల్లేశ్వరంలోని కె.సి.జి.లో జేర్చారని విని ముందర అక్కడ వెతికారు సన్యాసిరావు కోసం అతని వాళ్లు. అదృష్టం కొద్దీ వాళ్ళకతను అక్కడే కనిపించాడు. ఎంతమందికో ఎన్ని చోట్ల తిరిగినా కావలసినవారు కనిపించలేదుట. వందల సంఖ్యలో స్త్రీలు, పిల్లలు చనిపోయారుట అని విన్న వరలక్ష్మి భర్తకి ప్రమాదం జరిగినా బ్రతికి బయటపడ్డందుకు సంతోషించింది.

"నా క్లోజ్ ఫ్రెండ్ ఎంతో మంది స్త్రీలకి, పిల్లలకి హెల్పుచేసి క్షేమంగా ఇంటికి జేరుకొన్నాడన్నమాట" అన్నాడు సన్యాసిరావు. ఆ పైన " నాకేదీ సరిగ్గా చెయ్యటం రాదు. అతను అన్నీ పర్ఫెక్ట్‌గా చేస్తాడు" అన్నాడు.

తనకి పూర్వం మనసులో కలిగిన తప్పు భావం భర్త నోట్లో నుంచి వస్తుంటే "కాదు" అని అతన్ని నొప్పించలేక అవునన్నట్లు సజల నయనాలతో తలూపింది వరలక్ష్మి. ●

(ఆంధ్ర సచిత్ర వార పత్రిక ఏప్రిల్ 1982)